సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 10 । నవంబర్ । 2023

కళోత్సవం



సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్లలోని సినారె కళామందిర్‌లో కళోత్సవ్ -2023 పోటీలను జిల్లా విద్యాధికారి రమేశ్ గురువారం ప్రారంభించారు. జానపద నృత్యం, గానం, 2డీ, 3డీ, ఆర్ట్స్, ఇండీ జీనియస్ టాయిస్ అంశాల్లో పోటీలుంటాయని నిర్వాహకులు తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, గడ్డం శంకర్, సాన బాబు, యాదగిరిగౌడ్, హజూనాయక్, శ్రీనివాస్, స్వాతి, గోనె బాల్‌రెడ్డి ఉన్నారు.

నామినేషన్ల వివరాలు.. 6వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
సిరిసిల్ల	14	23
వేములవాడ	08	10

NOMINATIONS!

న్యూస్‌రీల్

నగదు, మద్యం రవాణా అరికట్టాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- కొదురుపాకలో పోలీస్ చెక్‌పోస్టు తనిఖీ



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

బోయినపల్లి(చొప్పదండి): జిల్లా సరిహద్దు గ్రామాల్లో పోలీస్ చెక్‌పోస్టులతో అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. కరీంనగర్, సిరిసిల్ల ప్రధాన రహదారిలో మండలంలోని కొదురుపాక చెక్‌పోస్టును గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు సిబ్బంది చేపడుతున్న వాహనాల తనిఖీల తీరు, వివరాల నమోదు రిజిష్టర్‌ను పరిశీలించారు. చెక్‌పోస్టులో లారీలతో సహా అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, చెక్‌పోస్టు సిబ్బంది ఉన్నారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, కేంద్ర బలగాల ఇన్‌చార్జిలు ఉన్నారు.

జిల్లాకు పోలీస్ అబ్జర్వర్ వినిత సాహూ



పోలీస్ అబ్జర్వర్ వినిత సాహూకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం/తంగళ్లపల్లి: అసెంబ్లీ ఎన్నికల జిల్లా పోలీస్ పరిశీలకులు వినిత సాహూ గురువారం జిల్లాకు వచ్చారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ స్వాగతం పలికారు. జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణ, చెక్‌పోస్టులలో ఇప్పటి వరకు పట్టుబడిన నగదు, ఇతర సరుకుల వివరాలు, సాయుధ బలగాల వినియోగం గురించి ఎస్పీ వివరించారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు పాల్గొన్నారు. జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు జిల్లెల్లను వినిత సాహూ పరిశీలించారు. స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలకు దిశానిర్దేశం చేశారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో



పఠనాసక్తి పరీక్షిస్తున్న డీఈఓ రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని గోపాల్‌నగర్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేశ్ గురువారం సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్ రిజిష్టర్ నిర్వహణ, పరీక్షల్లో సాధించిన మార్కుల నమోదు వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సకాలంలో రుచికరంగా అందించాలని సూచించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను చక్కగా వినాలని, అప్పుడే మంచి మార్కులు వస్తాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వేణు, శివకుమార్, అజయ్‌కుమార్, భవానీ, మమత పాల్గొన్నారు.


రూ.3.50 లక్షలు పట్టివేత



నగదును పట్టుకున్న పోలీసులు

గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల సరిహద్దు గంభీరావుపేట మండలం పెద్దమ్మస్టేజీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి కరీంనగర్ వెళ్తున్న వాహనంలో రూ.3.50 లక్షలు పట్టుబడినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. సరైన ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకొని, జిల్లా గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించినట్లు వివరించారు.

వస్తా మీ వెనకా..



- పతికి మద్దతుగా సతి
- డమ్మీ నామినేషన్ వేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల సతీమణులు
- కోరుట్లలో బీఆర్ఎస్ అభ్యర్థికి తండ్రి..
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 314 సెట్లు దాఖలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: రాజకీయాల్లో నమ్మకం అనేది చాలా విలువైనది. ఏమాత్రం అవకాశం దొరికినా.. వెన్నుపోట్లు ఎదురవుతాయి. అందుకే, ప్రతీ నాయకుడు తాను వేసే అడుగుల్లో ముందు తన కుటుంబసభ్యులే నడవాలని కోరుకుంటారు. నామినేషన్ వేసే దశ నుంచే ఈ మేరకు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటారు. అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించే నామినేషన్ అఫిడవిట్‌లో సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. అలాంటి సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశాలుంటాయి. ఈ క్రమంలో ముందుచూపుతోనే ఒకప్పుడు నాయకుడు తమకు నమ్మకస్తులైన అనుచరులతో డమ్మీ నామినేషన్ వేయించేవారు. రానూరాను రాజకీయాల్లో వెన్నుపోట్ల సంప్రదాయం పెరిగిపోవడంతో నేతలు తమ కుటుంబసభ్యులతోనే డమ్మీ నామినేషన్ వేయిస్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత.. అంతా బాగుంది అనుకుంటే తమవారి కోసం వీరు నామినేషన్ ఉపసంహరించుకుంటారు.



- ఈటల: హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి జమున ప్రతీ ఎన్నికల సందర్భంగా డమ్మీ నామినేషన్ వేస్తున్నారు. గతంలో ఇలా ఏడుసార్లు వేశారు. ఇప్పుడు కూడా డమ్మీ నామినేషన్ వేశారు.

జంగ్ తెలంగాణ

నేటితో ముగియనున్న గడువు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 214 మంది అభ్యర్థులు మొత్తం 314 సెట్ల నామినేషన్లు వేశారు. ఏకాదశి కావడంతో గురువారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నేటి(శుక్రవారం)తో గడువు ముగియనుండటంతో మరిన్ని నామినేషన్లు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గం	అభ్యర్థులు	వచ్చిన నామినేషన్లు
కరీంనగర్	17	25
చొప్పదండి	10	15
మానకొండూర్	15	23
హుజూరాబాద్	23	34
సిరిసిల్ల	14	23
వేములవాడ	15	20
పెద్దపల్లి	22	31
రామగుండం	19	24
మంథని	13	21
జగిత్యాల	37	60
కోరుట్ల	16	21
ధర్మపురి	13	17
మొత్తం	214	314



- కవ్వంపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ భార్య అనురాధ నామినేషన్ వేశారు. మానకొండూరు నుంచి ఈసారి ఎలాగైనా గెలవాలని ఆయన సర్వశక్తులు ఒడ్డుతున్నారు.



- పుట్ట: బీఆర్ఎస్ మంథని అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సతీమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ ఆయనకు డమ్మీగా నామినేషన్ వేశారు. ఇలా వేయడం ఇది మూడోసారి.



- ఆది: కాంగ్రెస్ వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సతీమణి వనజ నామినేషన్ వేశారు. గతంలో చందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలిగా పనిచేసిన ఆమె ఇప్పటివరకు నాలుగుసార్లు ఇలా వేశారు.



- చల్లా: మంథని బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణ రెడ్డి ప్రస్తుతం కాటారం పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్నారు. ఆయనకు డమ్మీ అభ్యర్థిగా భార్య సుజాత నామినేషన్ వేశారు. ఈమె గతంలో జెడ్పీటీసీ సభ్యురాలిగా పని చేశారు.

- కల్వకుంట్ల: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వారసుడిగా ఆయన కుమారుడు సంజయ్ ఈసారి ఎన్నికల బరిలో ఉన్నారు. కుమారుడికి రాజకీయాలు కొత్త కావడంతో తండ్రే అన్నీ తానై చూసుకుంటున్నారు. ఎందుకైనా మంచిదన్న ఆలోచనతో తానే డమ్మీగా నామినేషన్ కూడా వేశారు.





సిరిసిల్లలో నామినేషన్ వేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి





వేములవాడలో నామినేషన్ వేస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు, గోలి మోహన్

నామినేషన్ల జోరు

- నేడు ఆఖరు రోజు
- సిరిసిల్లలో 14 మంది 23 సెట్లు..
- వేములవాడలో 8 మంది 10 సెట్ల నామినేషన్లు

సిరిసిల్ల: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో పోటీచేసే అభ్యర్థులు గురువారం పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారంతో నామినేషన్ల పర్వం ముగియనుంది. సిరిసిల్లలో కాంగ్రెస్ అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డి నామినేషన్ వేయగా.. బీఆర్ఎస్ అభ్యర్థిగా కె.తారక రామారావు నామినేషన్ దాఖలు చేశారు. సిరిసిల్లలో మొత్తం 14 మంది అభ్యర్థులు 24 సెట్లు దాఖలు చేశారు. నామినేషన్ వేసిన వారిలో రాగుల రాములు(ఆబాద్ పార్టీ), దోసల చంద్రం(ఇండియా ప్రజాబంధు), గోగుల రాణీరుద్రమ(బీజేపీ), పత్తిపాక సురేశ్(ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్), భూమేశ్ పిట్టల(బీఎస్పీ), కేసుగంటి పరమేశ్వరి(ధర్మ సమాజ్ పార్టీ), గౌటే గణేశ్(శివసేన), స్వతంత్రులుగా రిక్కుమల్ల మనోజ్‌కుమార్, అన్నారం సాయికుమార్, దొనికెని కృష్ణలు నామినేషన్లు వేశారు.

వేములవాడలో 8 నామినేషన్లు

వేములవాడ: వేములవాడలో గురువారం ఎనిమిది మంది నామినేషన్లు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌కు అందించారు. బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, బీఎస్పీ నుంచి గోలి మోహన్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా గగులోతు రవి, పిరమిడ్ అభ్యర్థిగా జక్కని భూపతి, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా గుడిసె మోహన్, మేర్పుల రాకేశ్, కట్కూరి అనూస్, అంగూరి రంజిత్ తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఎనిమిది మంది పది సెట్లను దాఖలు చేశారు.

ఎలాంటి ఫిర్యాదులున్నా తెలియజేయండి

- ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్

సిరిసిల్ల: ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులున్నా తెలియజేయాలని ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్ కోరారు. జిల్లాలో పార్టీలు, అభ్యర్థుల ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు ఉన్న తనకు తెలియజేయాలన్నారు. గురువారం జిల్లాకు చేరుకున్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. సిరిసిల్లలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌కు ముందస్తు సమాచారంతో వచ్చి తనను కలువవచ్చన్నారు. స్వయంగా రాలేనీ వారు మొబైల్ నంబర్ 89771 23147, ల్యాండ్‌లైన్ 08723-227022 నంబర్లలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



జగదీశ్ సోన్‌కర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

సాధారణ పరిశీలకుడితో కలెక్టర్ భేటీ

జిల్లాకు వచ్చిన సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్‌కు పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ వద్ద కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్ అధికారులు ఎస్.ఆనంద్ కుమార్, మధుసూదన్‌లతో భేటీ అయ్యారు.



మీకు తెలుసా?

ఏ-ఫాం.. బీ- ఫాం అంటే?

కరీంనగర్ అర్బన్: ఎన్నికలొచ్చాయంటే ఏ-ఫాం, బీ-ఫాం పదాలు చర్చకొస్తుంటాయి. 25ఏళ్లు నిండినవారు ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు కాగా.. పార్టీ గుర్తు రావాలంటే ఫాంలతోనే సంబంధం. పార్టీ తరఫున ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే పత్రమే బీ-ఫాం. తమ పార్టీ నుంచి ఫలానా వ్యక్తి పోటీపడుతున్నారని, పార్టీ గుర్తు కేటాయించాలని అభ్యర్థించడమే ఈ పత్రం ముఖ్య ఉద్దేశం. ఇక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థిని ధ్రువీకరించేందుకు జాతీయ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్రస్థాయిలో ఒకరికి అధికారం అప్పగిస్తారు. ఈ ప్రక్రియనే ఏ-ఫాం కాగా.. అధికారం పొందిన వ్యక్తి అభ్యర్థికి బీ-ఫాం జారీ చేస్తారు. రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు తాను లేదా మరొకరికి లేదా జిల్లాస్థాయిలో ఒకరికి బీ-ఫాం జారీ చేసే అధికారాన్ని అప్పగిస్తుందని ఏ-ఫాం సూచిస్తుంది. ఏ-ఫాం ద్వారా అధికారం పొందిన వ్యక్తి పోటీచేసే అభ్యర్థికి బీ-ఫాం ఇస్తారు. ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలు నామినేషన్ దాఖలు సమయంలో లేదా నామినేషన్ చివరి రోజు మధ్యాహ్నం 3గంటల్లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందించాలి.

ఇంటింటికీ ప్రగతి నివేదికలు



బీఆర్ఎస్ ఆఫీస్‌లో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- నా ధైర్యం మా గులాబీ దండు
- తామే అభ్యర్థిగా భావిస్తూ కష్టపడుతున్నారు
- సిరిసిల్లలో మంత్రి కేటీఆర్
- సర్వమత ప్రార్థనలు.. ఆశీర్వాదాలు
- సామాజిక సమీకరణలతో నామినేషన్ దాఖలు

సిరిసిల్ల: బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఏం చేసిందో వివరిస్తూ ఇంటింటికీ ప్రగతి నివేదికలు అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆఫీస్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, రోడ్లు అన్నింటా ఈ ప్రాంతం అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఎట్లున్న సిరిసిల్ల ఎట్ల మారింది.. పట్టణమే కాదు.. ప్రతి ఊరూ..వాడలోనూ అభివృద్ధి పనులు కనిపిస్తాయన్నారు. రాజకీయంగా జన్మనిచ్చిన సిరిసిల్లకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఎక్కడికెళ్లినా ఈ గుర్తింపు.. గౌరవం మీరిచ్చిందేనన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్రం మొత్తం తిరగాల్సి వస్తుందని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండడంతో మీ అందరిని కలువలేక పోతున్నానని పేర్కొన్నారు. నా ధైర్యం మా గులాబీ దండు.. ఎవరికి వారే అభ్యర్థులుగా కథానాయకులుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని వివరించారు. ఎంత మెజార్టీ వస్తుందో కానీ అందరూ కష్టపడి పని చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా.. కుతంత్రాలు పన్నినా సిరిసిల్ల ఓటర్లు ప్రలోభాలకు లొంగరన్నారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, సిరిసిల్ల ఏఎంసీ చైర్మన్ పూసపల్లి సరస్వతి, బీఆర్ఎస్ నాయకులు చీటి నర్సింగరావు, దరువు ఎల్లన్న, గోపాల్‌రావు, బొల్లి రామ్మోహన్, అక్కరాజు శ్రీనివాస్, గజభీంకార్ రాజన్న, సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సర్వమత ప్రార్థనలు

హెలికాప్టర్‌లో సిరిసిల్లకు చేరుకున్న మంత్రి కేటీఆర్ నేరుగా తెలంగాణ భవన్‌కు వెళ్లారు. హిందూ పూజారులు, ముస్లిం, క్రైస్తవ మతపెద్దలు ప్రార్థనలు చేసి ఆశీర్వాదం అందించారు. స్థానిక సంజీవయ్య, అంబేడ్కర్, గాంధీవిగ్రహాలకు పూలమాలలు వేసి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసేందుకు సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, వీర్నపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు గుగులోత్ కమల, ముస్తాబాద్ నుంచి కొమ్ము బాలయ్య, గంభీరావుపేట ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డిలతో కలిసి వెళ్లారు. భారీ ర్యాలీ నిర్వహించకుండానే కొద్ది మంది పార్టీ నాయకులతో కలిసి వచ్చి నామినేషన్ దాఖలు చేయడం విశేషం. అనంతరం కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. పార్టీ శ్రేణులతో చర్చించారు.

పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు

- ఎగ్జిట్‌పోల్స్‌పై నిషేధం
- కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల: పోలింగ్ రోజు ఈనెల 30న వేతనంతో కూ డిన సెలవును ఇస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారని జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు వేతనంతో కూడిన ప్రభుత్వ సెలవును ప్రకటిస్తూ జీవో జారీ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఓటర్లు తమ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎగ్జిట్‌పోల్స్‌పై నిషేధం

ఎన్నికల నేపథ్యంలో ఎగ్జిట్‌పోల్స్‌పై నిషేధం విధిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఈనెల 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 30వ తేదీ సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధించినట్లు తెలిపారు. ఈ ఉత్తర్వులను ఎవరు ఉల్లంఘించినా ఎలక్టోరల్ చట్టం ప్రకారం రెండేళ్ల వరకు జైలు, జరిమానా లేదా రెండూ ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

పేదలకు ఉచితంగా న్యాయసేవలు

- చట్టాలు తెలిస్తే..నేరాలు చేయరు
- జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత
- సిరిసిల్ల కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు

సిరిసిల్లటౌన్: వివిధ కేసుల్లో న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే నిరుపేదలకు ఉచితంగా న్యాయసేవలు అందిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత తెలిపారు. పౌరులకు చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు చేయరన్నారు. న్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులో గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ లోక్ అదాలత్‌లలో కోర్టు ఇచ్చిన అవార్డు అంతిమతీర్పు అన్నారు. దీనిపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. గ్రామీణులకు కోర్టులపై అవగాహన ఉండదన్న ఉద్దేశ్యంతోనే పల్లెల్లో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు జరుపుతున్నట్లు వెల్లడించారు. చట్టాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతోనే గ్రామాల్లో ప్యారాలీగల్ వలంటీర్లను నియమించామని, వీరు చట్టప్రకారం పౌరులకు వర్తించే హక్కులపై ప్రజలకు సూచనలిస్తారని తెలిపారు. అదాలత్‌లో పరిష్కారమయ్యే సివిల్ కేసులకు సంబంధించిన ఫీజును వాపస్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్క రూపాయి కట్టకుండానే ప్రిలిటికేషన్ కేసులను కోర్టులో వేయొచ్చన్నారు. అదాలత్‌కు ముద్దాయి రావాల్సిన అవసరం కూడా ఉండదని, ఇక్కడ రాజీపడితే ఇరుపక్షాలు గెలిచినట్లేనన్నారు.



కోర్టులో ఈఎన్‌టీ వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా జడ్జి ప్రేమలత

ఉచిత ఈఎన్‌టీ వైద్యశిబిరం

మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాసర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్, శ్రీసాయి వెంకటరమణ ఆస్పత్రుల వైద్యులు కోర్టు సిబ్బందికి, న్యాయవాదులకు ఉచిత ఈఎన్‌టీ వైద్యసేవలు అందించారు. సీనియర్ సివిల్ జడ్జి ఆర్.శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, లోక్ అదాలత్ మెంబర్ చింతోజు భాస్కర్, పెంట శ్రీనివాస్, ఆడెపు వేణు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ సెకండియర్ చదువుతున్న సర్దార్ వేణు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు గురువారం కాలేజీ ప్రిన్సిపాల్ మల్లేశం, అధ్యాపకులు అభినందించారు.

వైఎస్సార్‌టీపీ వెంటే క్యాడర్

- పార్టీ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము పార్టీ మారారని.. క్యాడర్ అంతా పార్టీ వెంటే ఉంటుందని ఆ పార్టీ తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు పూర్మాణి కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధ్యక్షురాల వైఎస్.శర్మిల ఆదేశాలను సారం నడుచుకుంటామన్నారు. పార్టీ యూత్ మండలాధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, బీసీ అధ్యక్షుడు రాచర్ల రాజు, నాయకులు రమేశ్, నాగరాజు, ఎల్లయ్య, వెంకటరెడ్డి, వెంకటేశ్, తిరుపతి, కరుణాకర్, పర్శరాములు పాల్గొన్నారు.

షాహిదాకు ఆర్థిక సాయం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బండలింగంపల్లికి చెందిన నిరుపేద మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఆమెకు చికిత్స కోసం దాతలు ఆర్థికసాయం చేస్తున్నారు. గత నెల 28న 'సాక్షి'లో వచ్చిన 'ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు' అనే కథనానికి స్పందిస్తున్న దాతలు సాయమందిస్తున్నారు. షాహిదా ఆరోగ్యం బాగుపడడానికి చికిత్స కోసం రూ.2.50 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. చేతిలో చిల్లి గవ్వలేక ఆర్థికసాయం చేయాలని కోరడంతో పలువురు స్పందిస్తున్నారు. మై వేములవాడకు చెందిన చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు గురువారం రూ.10వేల సాయం అందించారు.

శిక్షణ ఐపీఎస్‌ను సన్మానించిన ఎస్పీ



జగిత్యాలక్రైం: కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివమారుతిరెడ్డి యూపీఎస్సీ సివిల్స్‌లో 131వ ర్యాంక్ సాధించి ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు ఎంపికై ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా శివమారుతిరెడ్డి కలిశారు. ఎస్పీ అతడితో పాటు ఆయన తండ్రి అంజిరెడ్డిని ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.

సోషల్‌వార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): యూత్ ఎక్కువగా ఉండే సోషల్ మీడియాపైనే ప్రధాన పార్టీలన్నీ దృష్టి పెడుతున్నాయి. ఈ ఎన్నికల్లో సోషల్‌మీడియాను వేదికగా చేసుకొని ఒకరిపై ఒకరు విమర్శలు, ప్రతివిమర్శలకు దిగుతున్నారు. పోస్టులు ఒక్కోసారి వైరల్‌గా మారి వివాదాస్పదమవుతున్నాయి. ఆయా పోస్టులపై పల్లె నుంచి పట్టణం వరకు అంతటా చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఈసారి ఎన్నికల్లో సోషల్‌మీడియా ప్రభావం తీవ్రంగానే ఉంటుందని విశ్లేషకుల అంచనా. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డిపేటలో ఇటీవల జరిగిన యువ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ సోషల్‌మీడియాపై యువత దృష్టి సారించి ముందుకుసాగాలని సూచించడం దీని ప్రాధాన్యతను తెలుపుతుంది.



- వైరల్ అవుతున్న పోస్టింగులు
- ప్రచారాస్త్రాలుగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్
- యువతే లక్ష్యంగా కామెంట్స్
- ప్రధాన పార్టీలన్నీ ఆన్‌లైన్ ప్రచారంపైనే దృష్టి
- విమర్శ, ప్రతివిమర్శలు
- ఎన్నికల ఫలితాలపై 'సోషల్' ప్రభావం

ఫేస్‌బుక్, యూట్యూబ్‌లే ప్రధానాస్త్రాలు

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో చేస్తున్న ప్రచారాల వీడియోలను ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో లైవ్ ప్రసారం చేస్తున్నారు. యువతను టార్గెట్ చేస్తూ ప్రధాన పార్టీలన్నీ సోషల్‌మీడియాను నమ్ముకొని ఓట్ల కోసం గాలం వేస్తున్నాయి. సినిమా పాటలకు స్టెప్పులేస్తూ.. డైలాగ్‌లకు యాక్షన్ చేస్తూ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాలైన సిరిసిల్ల, వేములవాడల్లో బరిలో నిలిచిన అన్ని పార్టీల అభ్యర్థులు తమ సోషల్‌మీడియా ఇన్‌చార్జీలను నియమించుకొని రోజువారీ ప్రచార వీడియోలు, ప్రతిపక్షాలు చేసే కామెంట్లకు ధీటైన కౌంటర్లు ఇస్తున్నారు. ఇది ఇటీవల మరీ ఎక్కువైంది. ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్ 'దేఖ్‌లింగే...' పాటపై డ్యాన్స్ చేయగా వైరల్‌గా మారింది. దీనిపై ప్రతిపక్ష పార్టీలు కౌంటర్ వీడియో పోస్టు చేయడం దుమారం రేపింది. దీనిపై జిల్లా అంతటా చర్చ సాగింది. అన్ని పార్టీలు సోషల్‌మీడియా ఇన్‌చార్జీలతోపాటు పలువురు యువకులతో పోస్టులు పెడుతున్నారు. మాటకు.. మాట, పోస్టుకు వెంటనే కౌంటర్ పోస్టులు పెడుతూ ప్రచారంలో వేడి కొనసాగిస్తున్నారు.

పాతతరంపైనా దృష్టి

యువతే కాకుండా పాతతరం ఓటర్లను ఆకట్టుకునేందుకు అన్ని పార్టీలు ఆయా ప్రాంతాలకే ప్రత్యేకమైన పాటలతో వీడియో పోస్టులు పెడుతున్నాయి. పల్లెల్లో బీడీకార్మికులు, సామాన్య రైతులు, సీనియర్ సిటిజెన్స్ సైతం సాయంత్రం వేళ నలుగురు కలిసిన హోటళ్లు, మడిగెలు, గుంపులుగా ఒక చోట బీడీలు చుట్టే మహిళలు.. తమ వద్ద ఉన్న ఫోన్లలో వైరల్ అవుతున్న వీడియోలను చూసి నాయకుల నటన స్వరూపాలపై చర్చించుకుంటున్నారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన సోషల్ మీడియా నేడు పల్లెలను తాకడంతో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో దాని పాత్ర తీవ్రంగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

స్వగ్రామానికి గల్ఫ్ కార్మికుడి మృతదేహం

కోరుట్లరూరల్: గుమ్లాపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్ కార్మికుడు బోయిని వెంకటయ్య(53) వారం క్రితం ఖతార్‌లో గుండెపోటుతో మృతిచెందగా.. ఆయన మృతదేహం గురువారం స్వగ్రామం చేరింది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వెంకటయ్య 30ఏళ్లుగా ఖతార్ వెళ్లి వస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం సెలవుపై వచ్చి వెళ్లిన వెంకటయ్య వారం క్రితం పని చేస్తుండగా గుండెపోటు వచ్చింది. తోటి కార్మికులు వెంటనే ఖతార్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే మృతిచెందాడు. ఈ విషయం వారి కుటుంబ సభ్యులు గల్ఫ్ సమితి వారికి చేరవేయగా.. వారు ఐసీబీఎఫ్ సహకారంతో మృతదేహాన్ని త్వరగా స్వదేశం తీసుకొచ్చేందుకు కృషి చేశారు. గురువారం వెంకటయ్య మృతదేహం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోగా.. ప్రభుత్వం ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించింది. గల్ఫ్ సమితి సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకటయ్యకు భార్య లక్ష్మి, ముగ్గురు కూతుళ్లు. అందరికీ వివాహమైంది. కుటుంబ మృతిచెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని గల్ఫ్ సమితి సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడు వెంకటయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

అమాత్య పదవుల్లో మనోళ్లు

- ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటివరకు 21 మందికి మంత్రిగా అవకాశం
- సీఎం, పీఎంగా పని చేసిన పీవీ
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అయిన చెన్నమనేని



కరీంనగర్ అర్బన్: ఉమ్మడి జిల్లాలో 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా ఇప్పటి వరకు 21 మందిని అమాత్య పదవి వరించింది. పీవీ నర్సింహారావు ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా పనిచేశారు. బీజేపీ నేత చెన్నమనేని విద్యాసాగర్‌రావు రెండుసార్లు కరీంనగర్ ఎంపీగా గెలిచి, అప్పటి ప్రధాని వాజ్‌పేయి కేబినెట్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా చేశారు.

- మంథని నుంచి 1983, 85, 89లలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన దుద్దిళ్ల శ్రీపాదరావు 1991 నుంచి నాలుగేళ్లపాటు శాసనసభ స్పీకర్‌గా పని చేశారు. ఇదే నియోజకవర్గం నుంచి ఆయన తనయుడు శ్రీధర్‌బాబు 1999, 2004, 2009 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల మంత్రివర్గాల్లో స్థానం దక్కించుకున్నారు.
- పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన ఎం.సత్యనారాయణరావు 2004 ఎన్నికల్లో కరీంనగర్ ఎమ్మెల్యేగా విజయం సాధించి, వైఎస్సార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఆర్టీసీ చైర్మన్‌గానూ వ్యవహరించారు.
- 1957లో ఎమ్మెల్యేగా ఎన్నికైన జె.చొక్కారావు (కాంగ్రెస్) జలగం వెంగళరావు కేబినెట్‌లో మంత్రిగా వ్యవహరించారు. 1985లో ఇదే స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సి.ఆనందరావు(టీడీపీ) ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు.
- 1994, 99లో నేరెళ్ల(ప్రస్తుతం రద్దు) నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన సుద్దాల దేవయ్య(టీడీపీ) చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు. ఇదే స్థానం నుంచి పాటి రాజం మూడుసార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్‌లలో చోటు దక్కించుకున్నారు.
- 1985, 89, 94లలో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందిన న్యాలకొండ రాంకిషన్‌రావు(టీడీపీ) చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు.
- 1978, 83లలో మెట్‌పల్లి(ప్రస్తుతం రద్దు) నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వర్దినేని వెంకటేశ్వర్‌రావు(కాంగ్రెస్) కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారు.
- 1999, 94లలో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించిన ఇనుగాల పెద్దిరెడ్డి చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రిగా పని చేశారు. ఇదే స్థానం నుంచి 2004, 2008(ఉప ఎన్నిక)లలో ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మీకాంతారావు(టీఆర్ఎస్) వైఎస్సార్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్నారు.
- 1985, 89, 94, 99లలో వరుసగా నాలుగుసార్లు కమలాపూర్(ప్రస్తుతం రద్దు) నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ముద్దసాని దామోదర్‌రెడ్డి (టీడీపీ) ఎన్టీఆర్ ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రిగా చేశారు. 1962, 67లలో కమలాపూర్ నుంచి రెండుసార్లు గెలిచిన కె.వి.నారాయణరెడ్డి న్యాయశాఖ మంత్రిగా సేవలందించారు.
- 1989, 1999, 2004లో బుగ్గారం (ప్రస్తుతం రద్దు) నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి రత్నాకర్‌రావు వైఎస్సార్ కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు.
- 1994, 2009లలో జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన టీడీపీ అభ్యర్థి ఎల్.రమణ చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి పదవి దక్కించుకున్నారు. ఇదేస్థానం నుంచి 1983, 1989, 1996 (ఉప ఎన్నిక), 1999, 2004లలో ఎమ్మెల్యేగా గెలిచిన టి.జీవన్‌రెడ్డి ఎన్టీఆర్, వైఎస్సార్ మంత్రివర్గాల్లో సేవలందించారు. ఇక్కడి నుంచే 1985లో ఎమ్మెల్యేగా గెలుపొందిన జి.రాజేశంగౌడ్(టీడీపీ)ను ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రి పదవి వరించింది.
- కమలాపూర్‌లో రెండుసార్లు, హుజూరాబాద్‌లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈటల రాజేందర్ టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక, వైద్యారోగ్య, పౌరసరఫరాల శాఖల మంత్రిగా పని చేశారు. శాసనసభాపక్ష నేతగా వ్యవహరించారు.
- 2009, 2010, 2014, 2018లలో వరుసగా నాలుగుసార్లు సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి కేటీఆర్‌ను రెండుసార్లు అమాత్య పదవి వరించింది. అలాగే, 2009 నుంచి 2018 వరకు ధర్మపురి ఎమ్మెల్యేగా గెలిచిన కొప్పుల ఈశ్వర్ ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు.
- 2009, 2014, 2018లలో వరుసగా కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రస్తుతం గంగుల కమలాకర్ బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రిగా ఉన్నారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ కోచ్‌గా అజీమ్

జగిత్యాలరూరల్: కండ్లపల్లి మోడల్ స్కూల్ పీఈటీగా పనిచేస్తున్న అజీమ్ ఈనెల 11 నుంచి 13 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగనున్న అండర్–19 బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీం కోచ్‌గా వ్యవహరించనున్నారు.

జనవిజ్ఞాన వేదిక పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల: సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని జన విజ్ఞాన వేదిక జిల్లా వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి ఫిబ్రవరి 7 వరకు ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొనాలని కోరారు.

ఎక్సైజ్ నేరాల్లో పలువురి బైండోవర్



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

- రూ.18 లక్షల మద్యం పట్టివేత
- ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నాటుసార, గుడుంబా విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలో గురువారం ముగ్గురిని తహసీల్దార్ రామచందర్ ఎదుట బైండోవర్ చేశారు. స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 106 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 16,715 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. 73 లీటర్ల నాటుసారా, 75 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 277 కిలోల బెల్లం, పటికను పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.18.38 లక్షలు ఉంటుందని వివరించారు. ఎక్సైజ్ నేరాలకు ఉపయోగించిన ఒక ఆటో, రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 218 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. నాటుసారా తయారీ, రవాణా, సేవించే ప్రాంతాలను గుర్తించి దృష్టి పెట్టినట్లు తెలిపారు. ముడి పదార్థాలను అమ్మేవారిని జైలుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులను సన్మానిస్తున్న అధ్యాపకులు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్: ఇటీవల జగిత్యాల జిల్లా కొడిమ్యాలలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ ఎస్‌జీఎఫ్ అండర్–19 క్రీడల్లో జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వారిని గురువారం సిరిసిల్ల షాట్స్ వాలీబాల్ అకాడమీ ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ రఘునందన్, జిల్లా యువజన క్రీడాధికారి రాందాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకుమార్ తదితరులు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- డీఆర్డీవో శ్రీనివాస్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలలో వరి ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని డీఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, పదిర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. కేంద్రాల్లో ఉన్న రైతులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. డీఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించి తేమశాతం నిబంధనల ప్రకారం చూడాలన్నారు. డీపీఎం పాపారావు, ఏపీఎం శ్రీనివాస్, సీసీ సెంటర్ ఇన్‌చార్జీలు సుదర్శన్, వెంకటరమణ, బుక్కు కీపర్లు, కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు భరోసా ఇచ్చే నాయకుడికే..

- యువ ఓటర్ల మనోగతం



వేములవాడఅర్బన్: భవిష్యత్‌కు భరోసా ఇచ్చే నాయకుడినే ఎన్నుకుంటాం.. నోటుకు ఓట్లను అమ్ముకోం. మాకు అందివచ్చిన తొలి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం. అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేని పాలన అందించే నాయకులే అవసరం. అలాంటి వారితోనే మన ప్రాంతంతోపాటు మన జీవితాలు బాగుపడతాయి. అలాంటి వారినే ఎన్నుకుంటాం.. అంటున్నారు తొలిసారి ఓటు వేయబోతున్న యువ ఓటర్లు. మిగతా వారు కూడా ఆలోచించాలని.. మంచి చేసే నాయకులనే ఎన్నుకోవాలంటున్నారు. ఈ సందర్భంగా వారి మనోగతం..

ఓటుతోనే మంచి నాయకుడు



మనం వేసే ఓటుతోనే మంచి పాలన అందించే నాయకుడిని ఎన్నుకోవచ్చు. నా మొదటి ఓటు మంచి చేసే నాయకుడికి వేస్తాను. యువత కూడా ఆలోచించి ఓటు వేయండి.

– దివ్య, వేములవాడ

మన ఓటుతోనే భవిష్యత్



మనం వేసే ఓటును సరిగ్గా వినియోగించకపోతే భవిత్యత్‌లో ఇబ్బందులు పడతాం. ఆలోచించి ఓటు వేస్తే మనకు మంచి భవిష్యత్ ఉంటుంది.

– రేణుశ్రీ, వేములవాడ

ఓటుహక్కు వినియోగించుకుందాం



ప్రతి ఒక్కరూ ఓటుహక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి. ఓటుతోనే ప్రజలకు మంచి పాలన అందించే నాయకున్ని ఎన్నుకునే అవకాశం ఉంది. యువత ఆలోచనతోనే ఓటు వేయాలి.

– పూజ, శాత్రాజుపల్లి

అభివృద్ధి చేసే నాయకుడికే ఓటు



ఎన్నికలు వచ్చినప్పుడు వచ్చి.. మళ్లీ కనిపించని నాయకులకు ఓటు వేయొద్దు. రాజ్యాంగం ఓటు హక్కును కల్పించింది. మనకు అభివృద్ధి చేసే నాయకుడికి ఓట వేయాలి. యువత అలోచించి ఓటు వేయాలి.

– సమీర్, వేములవాడ

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్: అర్పపల్లి గ్రామంలో బుక్క రాజిరెడ్డి (53) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సారంగాపూర్ ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. రాజిరెడ్డి చాలాకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం తరలించారు. మృతుడికి కుమార్తె, కొడుకున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి



రాజేందర్(ఫైల్)

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందారు. కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన గుండవేని రాజేందర్ గోవిందారంలోని అక్క ఇంటికి దీపావళి నోముల సందర్భంగా రంగులు వేయడానికి వెళ్లాడు. రంగులు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి పడిపోగా.. జగిత్యాలలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాజేందర్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రాజమణి, ఇంటర్ చదువుతున్న కూతురున్నట్లు బంధువులు తెలిపారు.

భోజనాల వద్ద తన్నుకున్న బీఆర్ఎస్ నాయకులు

ధర్మపురి: మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మపురిలో నామినేషన్ వేయగా.. కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వారి కోసం ఓ ఫంక్షన్‌హాల్‌లో భోజనాలు ఏర్పాటు చేశారు. వడ్డిస్తున్న సమయంలో కొందరు గొడవకు దిగారు. ఒకరిపై ఒకరు బెంచీలు, కుర్చీలు ఎత్తేసుకున్నారు. దీంతో ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అక్కడ వాతావరణం రసాభాసగా మారింది.